విశాలాంధ్ర
విజయనగరం
శనివారం 18, జనవరి 2025

## ఆర్టీసీలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తు ఆహ్వానం

### డిపో మేనేజర్ శ్రీనివాసరావు

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** విజయనగరం డిపో నందు జనవరి 20 వ తేదీన ప్రారంభం కానున్న ఆర్టీసీ ఆధ్వర్యంలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన 20 వ బ్యాచ్ నందు చేరుటకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైందని డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్స్ ఒక సంవత్సరం అనుభవం కలిగి 21 సం. నిండిన వారు ఈ వెహికల్ లైసెన్స్ డ్రైవింగ్ ట్రైనింగ్ కు అర్హులు. మొత్తము శిక్షణ 40 రోజుల పాటు వుంటుందన్నారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరచు కావాలని మనవి. మరిన్ని వివరాలకు 7382924030, 9866649336, 9959225620 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

# ఉపాధి హామీ నిధులతో రేగపుణ్యగిరి రోడ్డు నిర్మాణం

### జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్

### గిరిజనుల సమగ్ర అభివృద్దే తమ ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

**విశాలాంధ్ర-శృంగవరపుకోట:** పుణ్యగిరి వద్ద ఏర్పాటు చేసిన గిరిజనుల ప్రత్యేక సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేగ పుణ్యగిరికి చెందిన సీదర అర్జున్, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పలరాజు, జనసేన నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు కలెక్టర్ కి గిరిజనుల సమస్యలైనటువంటి రెగ పుణ్యగిరి డోలి మోతలకు స్వస్తి పలికి రహదారి నిర్మాణం చేపట్టాలని, మినీ అంగన్వాడి కేంద్రం, జీవనోపాధి కొరకు మేకలు గొర్రెలు పశువులు అందించాలని, జలజీవన్ పథకంలో భాగంగా ఇంటింటికి త్రాగు నీరు, పోడు భూములకి పట్టాలు, ఇళ్ల స్థలాలు వంటి తమ సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. గిరిజనుల సమస్యలు పరిష్కారానికి ఆయా శాఖల అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అదేవిధంగా రేగ పుణ్యగిరి గ్రామానికి అవసరమైన 4కి.మీ రోడ్డు నిర్మాణానికి సంబంధిత అధికారులతో మాట్లాడి తీర్మానాన్ని సిద్ధం చేసి,త్వరలోనే శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ ఈ ప్రాంత గిరిజనుల సమగ్ర అభివృద్దే తమ ప్రభుత్వ లక్ష్యమని, గిరిజనుల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని,ఎన్నో ఏళ్ల డోలిమోత సమస్యలకు పరిష్కారం చూపించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మండలంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, డ్రోమ పీడీ, వివిధ శాఖల మండల అధికారులు రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యనిర్వాహణాధికారి అనురాధ, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ వబ్బిన సత్యనారాయణ,మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, జనసేన నాయకులు సన్యాసి నాయుడు మరియు కూటమి పార్టీల నాయకులు గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

## వర్కులు చేయని కాంట్రాక్టర్ల పై వేటు

### రీ టెండర్లకు చర్యలు: కమిషనర్ రామప్పలనాయుడు

**విశాలాంధ్ర-రాజాం:** రాజాం మున్సిపాలిటీలో 15 వ ఆర్థిక సంఘం నిధులకు చెందిన పనులు నాలుగేళ్లుగా చేయకుండా తాత్సారం చేస్తున్న ఆరుగురి కాంట్రాక్టర్ల పనులన్నీ రద్దుచేసినట్టు కమీషనర్ రామప్పలనాయుడు వెల్లడించారు. కోటి రూపాయలకు పైగా విలువ చేసే, 14 పనులు చేపట్టకుండా నాలుగేళ్లుగా కాలయాపన చేయడం చాలా దురదృష్టకరమన్నారు. దీనిని చాలా తీవ్రంగా పరిగణించామన్నారు. మరో రెండు నెలల్లో, 15 వ ఆర్థిక సంఘం గడువు ముగుస్తోంది. అయినా, టెండర్లు ఖరారు చేసుకుని, పనులు చేయకుండా సంవత్సరాలు దాటించేయడం ఏమిటో? అర్థం కావడం లేదన్నారు. దీనివల్ల, రాజాం ప్రజలకు తీరని నష్టం జరిగిందన్నారు. చాలా వార్డుల్లో సిసి రోడ్లు, డ్రైన్లు పనులు చేపట్టేందుకు టెండర్లు ఖరారుచేస్తే, దక్కించుకున్న కాంట్రా క్టర్లు నాలుగేళ్లు గడిపేయడం తీవ్రమైనదేనని అన్నారు. 14 పనులు జరిగి ఉంటే, చాలా వార్డుల్లో సమస్యలు తీరేవని అన్నారు. ప్రజలకు చాలా సౌకర్యంగా ఉండేదన్నారు. కావున, పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చి, వారి అగ్రిమెంట్ ను రద్దు చేసామన్నారు. మళ్లీ కొత్తగా పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం కూడా పొందినట్టు చెప్పారు. ప్రస్తుతం ఉన్న రేట్లతో ఆయా పనులు చేపట్టేందుకు కొత్తగా టెండర్లు పిలుస్తామని, టెండర్లు దక్కించుకున్నవారు, ఈ ఏడాది మార్చి నెలాఖరులోగా పనులు చేయాల్సిందేనని స్పష్టం చేసారు.

# పశు వైద్య(గరివిడి) విద్య కళాశాలకు శాశ్వత ప్రాతిపదికపై నియామకాలు చేయాలి

### ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు

**విశాలాంధ్ర-రేగిడి:** ఉత్తరాంధ్రలో ఉన్న ఏకైక పశు వైద్య విద్య కళాశాల గరివిడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన కావలసినంతమంది ప్రొఫెసర్స్ మరియు బోధనేతర సిబ్బంది నియమించకపోవడంతో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారి పరిశీలన సమయంలో వెంకటేశ్వర విశ్వవిద్యా లయం తిరుపతి నుండి, గన్నవరం విశ్వవిద్యాలయాల పరిశోధన స్థానాల నుండి ప్రొఫెసర్స్ ను బదిలీపై తీసుకొచ్చారు. ఆయా సబ్జెక్టులలో సమగ్రంగా విద్యాబోధన జరగడానికి తగిన మేధో వనరులు కొరతగా ఉందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల ముచ్చటగానే నవంబర్ నెలలో ఢిల్లీ నుంచి విచ్చేసిన భారత పశు వైద్య కౌన్సిల్ బృందం విచారణ సందర్భంగా విచ్చేసిన 18 మంది ప్రొఫెసర్స్ ను తిరిగి బదిలీ చేయడం వల్ల పరీక్షల సమయంలో విద్యార్థులలో నిరాశ నిస్పృహ కు గురయై అవకాశాలు లేక పోలేదని అదే సమయంలో శాశ్వత ప్రాతిపదిక మీద అన్ని సబ్జెక్టులకు ఆచార్యులను నియమించడం మంచి ఫలితాలు రాబట్టడానికి తద్వా రా గరివిడి లో ఉన్న పశు వైద్య కళాశాలకు గుర్తింపు వచ్చేదని మరింత ఎక్కువ మంది విద్యార్థులు ప్రవేశాలకు పోటీ ఉండేదని కానీ పై స్థాయి అధికారుల, పాలకుల ఉదాసీనత వంటి చర్యల వల్ల వచ్చే విద్యా సంవత్సరంలో జాయినింగ్స్ పై దీని ప్రభావం పడే అవకా శాలు ఉన్నాయని కావున ఉమ్మడి జిల్లాల మంత్రులు, శాసన సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే కళా వెంకట్రావు ప్రత్యేక చొరవ తీసుకొని పై సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం విజ్ఞప్తి చేస్తున్నది. గరివిడి లో ఉన్న పశు వైద్య కళాశాల వల్ల ఉత్తరాంధ్ర లో ప్రస్తుత కొరతగా ఉన్న పశు సంపదకు,వాటి బాగోగులు వైద్య పరంగా అందించడానికి ఇది ఎంతో దోహదపడుతుందని,పశు వైద్యులు పెరగడం ద్వారా గ్రామీణ ప్రాంత పాడి పరిశ్రమకు కీలకమవుతారని అటువంటి ప్రాధాన్యత ఉన్న గరివిడి పశు వైద్య విద్య కళాశాలకు కావలసిన అధ్యాపకులను,సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికపై నియమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తుందని సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. విలేకరుల సమావేశంలో నారు జనార్దన్ రావు(జిల్లా అధ్యక్షులు) విజయనగరం, కనపాక చౌదరి నాయుడు విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు, నారు సింహాద్రి నాయుడు(విశ్రాంత అర్థశాస్త్ర అధ్యాపకులు) చీపురుపల్లి, అంపోలు చిన్నమనాయుడు(నీటి సంఘం డైరెక్టర్) తదితరులు ఉన్నారు.

## అశ్లీల వీడియోలతో 'హనీ ట్రాప్'కు

## పాల్పడే నేరగాళ్ళ ఉచ్చులో పడొద్దు : ఎస్పీ వకుల్ జిందల్

**విశాలాంధ్ర -విజయనగరం టౌన్ :** మహిళల డిపిలు, వాయిస్, వీడియోలతో వచ్చే కాల్స్ తో 'హనీ ట్రాప్'లకు పాల్పడే సైబరు నేరగాళ్ళ ఉచ్చులో పడవద్దని, అటు వంటి సైబరు నేరగాళ్ళ పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పిలుపు నిచ్చారు. హనీ ట్రాప్ మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసుశాఖ ప్రత్యేకంగా రూపొందించిన 'హనీ ట్రాప్' షార్టు వీడియోను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ వివిధ సైబరు మోసాలపట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు జిల్లా పోలీసుశాఖ ప్రత్యేకంగా షార్టు ఫిల్మ్ ను రూపొందించి, సైబరు మోసాలు పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 'హనీ ట్రాప్' పేరుతో కొంతమంది మహిళలు ప్రజలను ఉచ్చులోకి ఏవిధంగా దింపుతారని, ఆయా మోసాల నుండి ఎలా బయట పడాలన్న విషయాన్ని షార్టు ఫిల్మ్ రూపొందించి, నేడు ఆవిష్కరించినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ షార్టు ఫిల్మ్ ను సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ ద్వారా ప్రజలకు మరింత చేరువ చేసి, వారిని మరింత అప్రమత్తం చేస్తామన్నారు. ఈ తరహా నేరంలో డబ్బుల కోసం కొంతమంది వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని, వారితో ఫోను, వాట్సాప్ సంభాషనలు, వీడియో కాల్స్ చేసి, ప్రేమ, సెక్స్ పేరుతో ఉచ్చులోకి దించి, వారితో చేసిన సంభాషణలను, వీడియోలను మార్ఫింగ్ చేసి, అశ్లీలంగా మార్చి, ఆయా వీడియోలను సోషల్ మీడియాలోను పోస్టు చేస్తామని లేదా ఫోను కాంటాక్ట్ ఉన్న ఫోను నంబర్లుకు పంపుతామని బెదిరింపులకు పాల్పడతారని, వీటిని వైరల్ చేయకుండా ఉండాలంటే తాము సూచించిన బ్యాంకు ఖాతాకు లేదా ఫోను నంబరుకు డబ్బులు పంపాలని కోరతారన్నారు. ఈ తరహా నేరాలకు పాల్పడే వారికి భయపడి, చాలా మంది వ్యక్తులు భారీగా డబ్బులను నష్టపోడం లేదా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇలా బెదిరింపులకు పాల్పడే సైబరు మోసగాళ్ళకు ఎట్టి పరిస్థితుల్లోను భయపడవద్దని, ఎటువంటి ఆలస్యం చేయకుండా వారిపై స్థానిక పోలీసు స్టేషనులోను లేదా సైబరు క్రైం పోర్టల్ కు లేదా 1930కు ఫోను చేయాలని ప్రజలకు కోరారు. పరిచయం లేని వ్యక్తులతో మితంగా సంభాషించడం, 'హనీ ట్రాప్'లో పడకుండా జాగ్రత్తలు చేపట్టడం శ్రేయస్కరమని ప్రజలకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ విజ్ఞప్తి చేసారు. ఈ షార్టు వీడియోను రూపొందించిన విశాఖకు చెందిన మీడియా ఎఫెక్స్ సభ్యులను, షార్టు ఫిల్మ్ లో నటించిన పి.హరి ని జిల్లా ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రంను అందజేసారు. ఈ షార్టు ఫిల్మ్ ఆవిష్కరణ కార్యక్రమంలో విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎఫెక్స్ మీడియా యజమాని సంతోష్, హరి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైవాడ కాలువపై శాశ్వత వంతెన నిర్మించాలి

### జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ కి వినతి

**విశాలాంధ్ర-వేపాడ :** మండలంలోని బానాది, బల్లంకి గ్రామాల నుండి ఆనందపురం కు వెళ్లే ప్రధాన రహదారిలో గల రైవాడ కాలువపై శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలని విశాఖపట్నం జీవీఎంసీ కమిసనీర్ శ్రీసంపత్ కుమార్ కి శుక్రవారం తన కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గత ఆదివారం తెల్లవారు జామున బల్లంకి గ్రామంలో రైవాడ కాలువపై ఎప్పుడో నిర్మితమైన వంతెన అకస్మాత్తుగా కూలిపోయిందని. ఈ ఘటన గ్రామస్థులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది.వంతెన కూలిపోవడంతో గ్రామస్థుల రాకపోకలు పూర్తిగా అంతరాయం కలిగాయన్నారు . ఈ పరిస్థితుల్లో గ్రామస్థులకు అనుకూలంగా తాత్కాలిక వంతెనను నిర్మించేందుకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిది గొంప కృష్ణ,గొంప వెంకటరావు మార్గదర్శకత్వంలో చర్యలు చేపట్టడం జరిగిందన్నారు .తాత్కాలికవంతెన నిర్మాణం పూర్తయిన తర్వాత, గ్రామస్థుల రాకపోకలు కొంతమేరకు సులభతరం అయినప్పటికీ ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు,టిడిపి అధికార ప్రతినిధి గొంప క్రిష్ణ ఆదేశాల మేరకు,జివిఎంసి కమిషనర్ శ్రీసంపత్ కి శుక్రవారం అభ్యర్థనతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించగా ఈ విషయంపై స్పందించిన విశాఖ జీవీఎంసీ కమిషనర్ శ్రీసంపత్ మాట్లాడుతూ వంతెన సమస్యను పూర్తి స్థాయిలో పరిశీలిస్తామని ఈ వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు, బల్లంకి ఉపసర్పంచ్ పల్లి ధనుంజయ్ నాయుడు, గొంప కుమార్ బల్లంకి బానది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బొబ్బిలి కోటలో రక్తదాన శిబిరం ను జయప్రదం చేయండి

### ఎమ్మెల్యే బేబీనాయన

**విశాలాంధ్ర-బొబ్బిలి:** తెలుగుదేశం పార్టీ వ్యవ స్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి కార్యక్రమాన్ని బొబ్బిలి కోటలో ఈనెల 18 నివారం ఉదయం 08:30లకు ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కే కే రంగారావు (బేబినాయన) బుడా చైర్మన్ తెంటు లక్ష్మ నాయుడు పూలమాలవేసి, అనంతరం రక్తదాన శిబిరం ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల టీడీపీ నాయకులు, క్రియాశీల కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎన్టీఆర్ అభిమానులు, తెలుగు యువత నాయకులు, తెలుగు మహిళా నాయకులు అందరూ కలిసి కట్టుగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) పిలుపునిచ్చారు.

## ఇంటి పన్ను వసూళ్ల పై కార్యదర్శులు దృష్టిపెట్టాలి : ఎండిఓ

**విశాలాంధ్ర-తెర్లాం:** మండల కేంద్రంలో ఎం పి డి ఓ ఆర్. రాంబాబు అధ్యక్షతన శుక్రవారం గ్రామ కార్యదర్శులతో ఇంటి పన్నులు వసూలు పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తనతో పాటు ఈ ఓ పి ఆర్డీ నీలిమ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ను ఉద్దేశించి ఎండిఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటిపన్నులు వసూలు ఇంతవరకు చేసినవి తక్షణమే గవర్నమెంట్ అకౌంట్ కు జమచేయాలని అన్నారు. వసూలు చేసిన ఇంటి పన్ను రసీదులు నగదు కోసిన తర్వాత 48గంటలు మాత్రమే మీ దగ్గర ఆ నగదు ఉంచ వచ్చని అంతకు మించి నగదు మన వద్ద ఉండడానికి లేదని, ఈ విష్యం కార్యదర్శులు దృష్టిలో పెట్టుకుని వసూలు చేసిన నగదును వెంటనే జమచేయాని సిబ్బందికి వివరించారు. ఇంటి పన్నులు పెండింగ్ ఉండకుండా త్వరతిగతిగా పూర్తి చెయ్యాలని ఈ కార్యక్రమం లో గ్రామ కార్యదర్శులకు ఎం డి ఓ అవగాహన కల్పించారు.

## అగ్ని ప్రమాదంలో పశువుల పాకలు దగ్ధం

### రూ. 1లక్షకు పైగా ఆస్తి నష్టం

**విశాలాంధ్ర-వేపాడ:** మండలంలోని వావిల పాడు గ్రామానికి చెందిన రైతులు ఈసరపు వెంకటరావు,గొలగాన మహాలక్ష్మీలకు చెందిన పశువుల పాకలు గురువారం రాత్రి అగ్ని ప్రమాదానికి గురై కాలి బూడిదయ్యాయి,ఈ మేరకు రైతులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం వరకు కల్లాల వద్దనే ఉండి చీకటి పడగానే ఇంటికి వచ్చేసిన తర్వాత రాత్రి ఏ సమయంలో అగ్నిప్రమాదం జరిగిందో తెలియదని శుక్రవారం ఉదయం వెళ్లి చూసేసరికి కాలి బూడిదయి పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ. 1లక్షకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్టు రైతులు చెబుతున్నారు. ఈ సంఘటన ఎలా జరిగిందో తెలియదని పశువుల పాకలో వున్న రెండు నాటు బళ్ళుతో పాటు విలువైన టేకు కలప కాళీ బూడిద అయిందని రైతు ఈసరపు వెంకట్రావు వాపోతున్నారు.

## సాంప్రదాయ క్రీడలతో ఘనంగా కనుమ వేడుకలు

**విశాలాంధ్ర-చీపురుపల్లి:** సంక్రాంతి అంటేనే సాంప్రదాయ వేడుక.. దీనికి అనుగుణంగానే పల్లె ప్రాంతాల్లో పండగ వాతావరణం పూర్తిగా సందడిగా మారింది. చీపురుపల్లి మండలం గొల్లలమల ములగాము గ్రామంలో కూడా సంక్రాంతి రోజు నుండి ముక్కను ముగిసే వరకు సాంప్రదాయ క్రీడా పోటీలతో గ్రామమంతా పండగ వాతావరణం సందడిగా జరిగింది. కాకినాడలో నివాసముంటున్న గ్రామ నివాసి స్టైలిష్ బ్రాంచ్ మేనేజర్ మీసాల వెంకటరమణ తన స్నేహితుల సహకారంతో గ్రామంలోని యువతీ యువకులకు చిన్న పిల్లలకు సాంప్రదాయ ఆటల పోటీల నిర్వహించి వారిని ప్రోత్సహించుటకు ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేశారు. ప్రత్యేకించి మహిళలకు చిన్నపిల్లలకు ముగ్గుల పోటీలు, యువతకు కబడ్డీ పోటీలు, పాటల పోటీలు డాన్స్ పోటీలు కుర్చీల ఆట వంటి తదితర క్రీడలు నిర్వహించి సాంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, యువకులకు, ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులను అందజేసి ప్రోత్సహించారు. ఏడాదికోసారి స్వగ్రామంలో ఇటువంటి వేడుకలు నిర్వహించడం గ్రామస్తులంతా సంతోషంగా కాలం గడపడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

## అనుమానస్పద స్థితిలో మహిళా మృతి

**విశాలాంధ్ర-రామభద్రపురం:** అనుమాన స్పద స్థితిలో ఒక మహిళ మృతి చెందిందని స్థానిక ఎస్సై వెలమల ప్రసాదు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయనతెలిపిన వివరాల ప్రకారం కొట్టక్కి గ్రామానికి చెందిన దండు సింహాచలం 55సం సంవత్సరాలు రామాలయం దగ్గరఆమె ఇంట్లో ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని అన్నారు. మృతదేహాన్ని శవపంచనామ కొరకు బాడింగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించమని అన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని అన్నారు.

## నగరంలో అనధికార నిర్మాణాలను ఉపేక్షించబోం

### కమిషనర్ పల్లి నల్లనయ్య

**విశాలాంధ్ర-విజయనగరం అర్బన్:** నగరం లో అనధికార నిర్మాణాలను ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించబోమని విజయ నగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య హెచ్చరించారు. 31వ డివిజన్ పద్మావతి నగర్ ఫస్ట్ లైన్, రోడ్డు నెంబర్ 1 ఏ ప్రాంతంలో అనధికారికంగా భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రణాళిక విభాగం అధికారులు సిబ్బంది అక్కడికి వెళ్లి భవన నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అక్రమ నిర్మాణంగా గుర్తించి తక్షణమే నిర్మాణ సామాగ్రిని తరలించడంతోపాటు భవన నిర్మాణాన్ని తొలగించారు. భవన నిర్మాణానికి అవసరమైన సిమెంట్ స్తంభాలను కూడా తొలగించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. వెంటనే సిబ్బంది పిల్లర్లను కూడా తొలగించే ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలను చేపట్టి నట్లయితే తక్షణమే అటువంటి నిర్మాణాలను తమ సిబ్బంది తొలగించి వేస్తారని స్పష్టం చేశారు. ఎక్కడ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఓ అప్పలరాజు, టి పి ఎస్ అనిత తదితరులు పాల్గొన్నారు. ..

## 108 అంబులెన్స్ వాహనంపై దుండగుల దాడి

### ఎదురుగా అద్దాలు, హెడ్లైట్లు చితక్కొట్టి ధ్వంసం చేసిన దుండగులు

### పోలీస్ గస్తీ లోపమే ఈ ఘటనకు కారణం అంటున్న స్థానికులు

**విశాలాంధ్ర-లక్కవరపుకోట:** మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయం, మండల విద్యాశాఖ అధికారి, వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాల మధ్య ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ చేసి ఉంటున్న 108 అంబులెన్స్ వాహనమును గురువారం రాత్రి మండల కేంద్రంలో గల కొంతమంది దుండగులు తప్ప తాగి ఈ ఈ వాహనంపై దాడి చేసి అద్దాలు పగలగొట్టి హెడ్లైట్లు పగలగొట్టి పరారైనట్లు జిల్లా 108 వాహనముల పర్యవేక్షణ అధికారి ఓయూ షణ్ముఖరావు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏ ఎస్ ఐ శ్రీనివాసరావు తెలిపారు, అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. దుండగులను దుండగులు ఎవరనేది విచారిస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల మధ్య పార్కింగ్ చేసి ఉంచిన వాహనమును దుండగులు దాడి చేసి దాంసం చేసినందుకు కారణం పోలీస్ గస్తీ లోపమే అని పలువురు విమర్శి స్తున్నారు. ప్రతిరోజు ఇదే స్థలములో పార్కింగ్ చేసి సంవత్సరాలు తరబడి ఈ వాహనాన్ని నిలుపుతున్నామని ముందు ఈనెల 15న కొంతమంది యువకులు అసాంఘిక కార్యకలాపాలు జరుపుకొని తమ సిబ్బందితో విభాగమునకు దిగారని తరువాత రోజు ఈ నెల 16న ఈ సంఘటన జరిగిందని గురువారం పగలంతా అత్యవసర సర్వీసులు అందించి విశ్రాంతి తీసుకునే సమయంలో ఈ సంఘటన జరిగిందని వెంటనే తమ పై అధికారులకు తెలియజేశామని అంబులెన్స్ డ్రైవరు గోపిశెట్టి విజయ్ తెలిపారు. అత్యవసర సర్వీసులు అందించిన వాహనంపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మార్చి 8 లోక్ ఆదాలత్ లో అధిక కేసులు పరిష్కరించండి

### రెండో అదనపు జిల్లా జడ్జి దామోదర్ రావు

**విశాలాంధ్ర-బొబ్బిలి :** సత్వర న్యాయానికి భారత సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వివిధ కోర్టులో పెండింగ్లో ఉన్న కేసులను రాజీమార్గంలో పరిష్కారం చేసుకుంటే విలువైన సమయముతో డబ్బు ఆదా అవుతుందని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్ దామోదర్ రావు , స్థానిక కోర్టు మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్ అరుణశ్రీ లుపిలుపునిచ్చారు. మార్చి నెల 8న జరుగు జాతీయ లోక్ ఆదాలత్ లో అధిక కేసులో పరిష్కారానికి ఎక్సైజ్ శాఖ, స్థానిక పోలీసులు , ఇరు వర్గాల న్యాయవాదులు కృషి చేయాలని వారు కోరారు. శుక్రవారం స్థానిక కోర్టులో ఎక్సైజ్ శాఖ, స్థానిక పోలీసులతో పార్వతీపురం రెండో అదనపు జడ్జి దామోదర్ రావు, స్థానిక మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్ అరుణశ్రీ లు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి దామోదర్ రావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జరుగుతున్న ఈ జాతీయ లోక్ అదాలత్ లో అన్ని రకాల సివిల్ కేసులు మరియు రాజీ కాదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కారంచేస్తామన్నారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో సంబంధిత పోలీస్ శాఖ అధికారులు తో మాట్లాడుతూ కోర్టు పరిధిలో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి కక్షిదారులకు సత్వర న్యాయం కోసం జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో సివిల్, మరియు క్రిమినల్, ఫ్రీ లిటిగేషన్ ఇరువర్గాలు రాజీ మార్గం ద్వారా కేసుల పరిష్కారం చేసుకుంటే విలువైన సమయం డబ్బు ఆదా అవుతుందని అన్నారు. సీనియర్ సివిల్ జడ్జి మండల నాయి సేవా సంస్థ చైర్మన్ ఎస్ అరుణశ్రీ కక్షిదారులు ఈ అవకాశం వినియోగించుకోవాలని, ఎక్కువ కేసులు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం రోహిణి రావు తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలల్లో మారికి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ డా. అంబేద్కర్

**విశాలాంధ్ర-వేపాడ:** మండలంలోని కరకవలస గ్రామ శివారు గిరిశికర గ్రామం మారిక రహదారి పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.శు క్రవారం మారిక రహదారిని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సారధ్యంలో ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అలాగే జనసేన నాయకులు శానాపతి కొండలరావు,సుంకరి అప్పారావు, జొన్నపల్లి సత్తిబాబు,డేగల ఈశ్వర రావుల మారిక గిరిజనులకు రహదారి సౌకర్యం లేక కనీస అవసరాలకు నోచుకో కుండా పోతున్నారని, గత నెలలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు బొలిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో గిరిజన గ్రామం సందర్శించి గిరిజన సమస్యలను ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది అన్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే కోళ్ళ కుమారి గత అసెంబ్లీ సమావేశంలో రహదారి సమస్యలపై గళం విప్పగా స్పందించిన జిల్లా కలెక్టర్ మారిక రహదారికి నిధులు మంజూరుకు హామీ ఇచ్చి రోడ్డు పనులు పూర్తి చేయమనడం అభినందనీయమని అన్నారు. 2013-14లో అప్పటి ప్రభుత్వం ప్రధానమంత్రి సడక్ యోజన పథకంలో ఐదు కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు.అప్పుడు సుమారు రెండు కిలోమీటర్లు మాత్రమే రోడ్డు నిర్మాణం చేపట్టి అటవీశాఖ అనుమతులు లేవని వదిలేసారని తెలిపారు. అప్పుడు మిగిలిన నిధులతో మరో రెండు కిలోమీటర్లకు నిర్మల్చాల్సి ఉంటుందని అన్నారు.మరో 7 కిలోమీటర్లకు నిధులు మంజూరు చేయాల్సి ఉంటుందని కలెక్టర్ ను అభ్యర్థించారు.దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఎంత నిధులు అవసరం అవుతాయని ఇంజనీరింగ్ అధికారులకు అడగ్గా సుమారు రూ.7 కోట్ల అవసరం ఉంటుందని తెలిపారు.దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ అక్కడే ఉన్న ఉపాధి హామీ పథకం పీడీని పిలిపించి అవసరమైన నిధులకు మంజూరు చేసి అందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు.అలాగే రహదారి పనులకు నిర్మాణానికి సంబంధించి రెండు మూడు రోజుల్లో ముహూర్తం పెట్టి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించాలని సూచించారు. అలాగే వచ్చే ఉగాది నాటికి రహదారి పనులు పూర్తి చేసినట్లయితే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదగా రోడ్డు ప్రారంభించడం జరుగుతుందని స్థానికులకు అధికారులకు తెలిపారు.దీనిపై గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తూ కలెక్టర్ బి. ఆర్.అంబేద్కర్ తీసుకున్న చొరవకు అభినందనలు తెలియజేయడంతో పాటు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం కరకవలస సమీపంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సుంకరి అప్పారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి మాట్లాడుతూ గిరిజన సమస్యలపై అక్కడికక్కడే స్పందించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ చర్యలు అభినందనీయమని అన్నారు. నియోజకవర్గంలోని రేగ పుణ్యగిరి, మారిక గిరిజనుల సమస్యలపై పరిష్కారానికి కలెక్టర్ స్పందన సంతోషదాయకమని ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ దాట్ల కీర్తి, పి.ఆర్ సూపరెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, డిప్యూటీ ఇంజనీర్ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, తహసిల్దార్ జె. రాములమ్మ, ఎంపీడీఓ సిహెచ్ సూర్యనారాయణ,ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జడ్పీటీసి ఎస్. అప్పారావు, మాజీ డిసిసిబి చైర్మన్ వెచలపు చిన వెంకట రాము నాయుడు,టిడిపి నాయకులు గుమ్మడి భారతి, గొంప తులసి, గ్రామ పెద్దలు ఎర్ర ప్రగడ సూర్యం, దుల్ల అప్పన్న, టిడిపి కార్యకర్తలు, మారిక గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కీ॥శే॥ ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

### మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు

విశాలాంధ్ర-వేపాడ : నేడు అనగా శనివారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షులు గోంప వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో ఉదయం 9 గంటలకు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించడం జరుగుతున్నదని కావున వేపాడ మండలం తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, బూత్ అధ్యక్షులు, మహిళా కమిటీ సభ్యులు ఎన్టీఆర్ అభిమానులు పాల్గొనవలసిందిగా ఆయన కోరారు..

# పరిశుభ్రమైన, స్వచ్ఛ జిల్లాగా రూపొందించడమే లక్ష్యం

### నేడు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, వార్డుల్లో పరిశుభ్రత కార్యక్రమాలు

### కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్లడి

**విశాలాంధ్ర-విజయనగరం** :ప్రతి నెలలో మూడో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛత దినోత్సవంగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో అన్ని గ్రామాలు, వార్డుల్లో శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నట్టు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా అన్నివర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ పరిశుభ్రమైన, స్వచ్ఛ జిల్లాగా రూపొందించడంలో భాగంగా జిల్లా కేంద్రంలోను, అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమాలను చేపడతామని వెల్లడించారు. ఇకపై ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛత దినోత్సవంగా పాటించి స్వచ్ఛతకు సంబంధించి ఒక్కో నెల ఒక్కో అంశంపై కార్యక్రమాలు చేపడతామన్నారు. జిల్లా ప్రజలంతా ఒక రోజు స్వచ్ఛత కార్యక్రమాలకు కేటాయించాలని పరిశుభ్రమైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయా శాసనసభ్యుల ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వేపాడ మండల కేంద్రం నుంచి జిల్లా అధికారులు, తహశీల్దార్‌లు, ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లతో కలెక్టర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్వచ్ఛత దివస్ నిర్వహణపై సూచనలు చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని ఆయా కార్యాలయాల ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో చేపట్టాలని ఇందులో ఆయా కార్యాలయాల సిబ్బంది అంతా పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణకు ప్రతి ప్రభుత్వ శాఖకు ఒక నోడల్ అధికారిని నియమించుకోవాలని కలెక్టర్ చెప్పారు. వారే తమ శాఖకు సంబంధించి ఈ కార్యక్రమాలను సమన్వయం చేసుకోవలసి వుంటుందన్నారు. స్వచ్ఛత కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్నిప్రాంతాల్లో ర్యాలీలు, మానవహారాలు, ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విద్యార్థులు, స్వయంశక్తి మహిళలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు తదితర అన్నివర్గాల భాగస్వాములయ్యేలా ఆయా మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్‌లు కార్యక్రమాలను రూపొందించాలన్నారు. దేశంలోనే పరిశుభ్రమైన రాష్ట్రంగా రూపొందించడంలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వంటి చర్యలకు పాల్పడకుండా ప్రజల్లో అవగాహన కల్పించాల్సి వుందన్నారు. రానున్న రోజుల్లో స్వచ్ఛ దినోత్సవంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను చేపడతామన్నారు. పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలపై విజయనగరం కమిషనర్ పి.నల్లనయ్య వివరించారు. శనివారం ఉదయం నగరంలోని కోట వద్ద పరిశుభ్రతపై మానవహారం నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలపై డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్టు డైరక్టర్ ఏ.కళ్యాణచక్రవర్తి వివరించారు. జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, జెడ్పీ సిఇఓ బి.వి.సత్యనారాయణ, సిపిఓ బాలాజీ, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సజావుగా కొనసాగుతున్న కానిస్టేబులు ఉద్యోగాల నియామక ప్రక్రియ : ఎస్పీ వకుల్ జిందల్

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్** : స్టైఫెండరీ పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు పి.ఎం.టి., పి.ఈ.టి. పరీక్షల ప్రక్రియ కొనసాగుతున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.జనవరి 17న నిర్వహించిన 12వ రోజు పి.ఎం.టి. మరియు పి.ఈ.టి. పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 475 అభ్యర్థులు మాత్రమే పి.ఎం.టి./పి.ఈ.టి. పరీక్షలకు హాజరయ్యారని, వారిలో 373 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు అర్హత సాధించారన్నారు. నియామకాల ప్రక్రియ వేకువ జామున 5గంటల నుండే ప్రారంభం కావడం, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో, పి.ఎం.టి. మరియుపి.ఈ.టి. పరీక్షలు సకాలంలో పూర్తయ్యాయన్నారు. పోలీసు నియామకాల ప్రక్రియను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు. అభ్యర్థులకు ముందుగా హాల్ టిక్కెట్స్ను పరిశీలించి, పోలీసు పరేడ్ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం,అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయస్సు నిర్ధారించే ధృవ పత్రాలను పరిశీలించి, అన్ని సర్టిఫికేట్స్ సక్రమంగా ఉన్నఅభ్యర్థులకు మాత్రమే బయోమెట్రిక్ తీసుకొని, పి.ఎం.టి. పరీక్షలకు అనుమతించామన్నారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన డిజిటల్ ఇక్విప్మెంట్స్ వినియోగించి, అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలతలను నిర్ధారించి, అర్హత సాధించిన అభ్యర్థులకు పి.ఈ.టి. పరీక్షలను అనుమతించామని తెలిపారు. ఈ నియామక ప్రక్రియలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డిఎస్పీలు ఎం.వీరకుమార్, యూనివర్స్, పి.వి.రమణమూర్తి, ఎస్.రాఘవులు, కే.థామస్ రెడ్డి, ఎఓ పి.శ్రీనివాసరావు, పలువురు సిఐలు, రిజర్వు ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పీఈటీలు మరియు ఇతర పోలీసు అధికారులు, పోలీసు కార్యాలయ ఉద్యోగులు పాల్గొని, ఎంపిక ప్రక్రియ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించారు.

## పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

### ఎస్పీ వకుల్ జిందల్

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్** : జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ జిల్లా పోలీసు కార్యాలయంలో "పోలీసు వెల్ఫేర్ డే" నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడుతూ - పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. "పోలీసు వెల్ఫేర్ డే" నిర్వహించుటలో భాగంగా పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబరులోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన జిల్లా ఎస్పీ, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను జిల్లా ఎస్పీ స్వయంగా పుస్తకంలో నోట్ చేసుకొని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని తెలిపారు.

## ఉపాధ్యాయ,ఉద్యోగులకు ఎన్నికల హామీలు నిలబెట్టుకోకుంటేఉద్యమించాటానికి సిద్ధం : ఎస్టీయూ

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్** : ఉపాధ్యాయ ఉద్యోగులకు ఎన్నికల హామీలు నిలబెట్టుకోకుంటే ఉద్యమించడానికి సిద్ధంగా ఉండాలని ఎస్టీయు జిల్లా అధ్యక్షులు కే జోగారావు అన్నారు శుక్రవారం జిల్లా ముఖ్యనాయకుల సమావేశం అమర్ భవన్ లో జిల్లా అధ్యక్షులు కె. జోగారావు అధ్యక్షత న జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం 2024 సాధారణ ఎన్నికల ప్రచార సమయంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన ఎన్నికల హామీలు నిలబెట్టుకోకుంటే ఉద్యమిస్తామని పేర్కొన్నారు. గత ఐదు సంవత్స రాలుగా ఈ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులు వారి జీతాలు మినహా మరి ఏ ఇతర ఆర్థిక పరమైన లబ్ధి పొందలేదని సరెండర్ లీవులు,డి.ఎ అరియర్స్,పి.ఆర్.సి బకాయిలు, రెండు సంవత్సరాల నుంచి ఏపీజీఎల్ఐ పాలసీలు మెచ్యూర్ అయినప్పటికీ వాటి చెల్లింపులు మరిచారని ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన మొత్తం బకాయిలు 32 వేల కోట్లు ఉండగా ఈ సంక్రాంతికి కేవలం 10 శాతం మాత్రమే చెల్లించారని మిగిలిన 90 శాతం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పాడ సూరిబాబు మాట్లాడుతూ 12వ వేతన సవరణ సంఘం సంబంధించిన కమిషన్ ఏర్పాటు ప్రక్రియ మొదలే పెట్టలేదని ఇప్పటికే 19 నెలలు ఆలస్యమైందని వెంటనే ప్రభుత్వం మధ్యంతర భృతి 30 శాతంని ప్రకటించకపోతే భావ సారూప్య సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని , యాప్ ల భారం తగ్గించాలని, తక్షణమే పదోన్నతులు చేపట్టి, బదిలీలకు సంబంధించి 8,అకడమిక్ సంవత్సరాల కాలపరిమితి మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతోందని ఇప్పటికీ ఎన్నికల హామీలు అయినా బకాయిల చెల్లింపు,12వ పిఆర్సి అంశాలపై ఉద్యోగ సంఘాలను చర్చలకే ఆహ్వానించడం లేదని గత ప్రభుత్వం వలే ప్రస్తుత ప్రభుత్వం కూడా బడ్జెట్ పేరుచెప్పి ఉద్యోగ ఉపాధ్యాయులకు అన్యాయం చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఎం. మురళి, జిల్లా ఆర్థిక కార్యదర్శి బి.ఈశ్వరరావు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి పి రాంబాబు ,జిల్లా కార్యదర్శిలు టి నాగేశ్వరరావు ,పి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు దుస్తుల పంపిణీ

**విశాలాంధ్ర-బొబ్బిలి:** మండలం కేసాయి వలస గ్రామంలో స్థానిక గిరిజనులకు శుక్రవారం గాంధీ స్మారక నిధి సభ్యులు దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.స్మారక నిధి అధ్యక్షుడు యం.విజయ మోహన్ రావు ఆధ్వర్యంలో వనమిత్ర కృష్ణ దాస్, జి.ధనంజయ, ఎస్. తిరుపతి నాయుడు కలసి 28 చీరలు, 12 జతల ఆడపిల్లల దుస్తులు, 22 దుప్పట్లు, తువ్వాళ్ళు, లుంగీలు , 14 జీన్ ప్యాంట్లు, 17 షర్టు లు , 20 జతల చిన్నపిల్లల దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా విజయ మోహన్ రావు మాట్లాడుతూ ప్రతి నెల పాత బొబ్బిలి బస్ స్టాప్ వద్ద ఉన్న దయ గల గోడ నుండి సేకరించిన వివిధ రకాల దుస్తులను బొబ్బిలి మక్కువ సాలూరు తదితర గిరిజన ప్రాంతాలకు అందజేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 48 నెలలుగా వందలాది దుస్తులను అందజేశామన్నారు. చిన్నపిల్లలకు, స్త్రీలకు బట్టలు అందజేయడం చాలా సంతృప్తికరంగా ఉందన్నారు.

## పరిశుభ్రతా రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలి

### కమిషనర్ పల్లి నల్లనయ్య

**విశాలాంధ్ర-విజయనగరం అర్బన్:** పరిశుభ్రతా రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర,స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ మేరకు శు క్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజారోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 నెలలకు, 12 అంశా లతో కూడిన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. డివిజన్ స్థాయిలో ప్రజాప్రతినిధులు, సిబ్బంది, వివిధ సంస్థల ప్రతినిధులు, సమన్వయంతో స్వచ్ఛత ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించి, అందరినీ భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రభుత్వ మార్గ నిర్దేశనంలో నెలకొక అంశాన్ని ప్రతినెల మూడవ శనివారం నాడు విజయవంతంగా నిర్వహించాలన్నారు. రేపు ఉదయం 10 గంటలకు కోట వద్ద నుండి మానవహారం, ప్రతిజ్ఞ, మాస్ క్లీనింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపిడిఓ తనిఖీలు

విశాలాంధ్ర-రాజాం: రాజాం మండలంలో ముద్దాడ జోగివలస గ్రామాన్ని ఎంపిడిఓ వావిలపల్లి. శ్రీనివాస రావు శుక్రవారం సందర్శించారు. వివిధ పనులు పరిశీలించారు. సచివాలయం ను సందర్శించి పథకాల అమలు, సర్వే తదితరమైన వాటిపై సమీక్ష జరిపారు. సిబ్బందికి పలు సూచనలు చేసారు.

# రీ సర్వే వినతులు అప్లోడ్ , పరిష్కారం ఏక కాలంలో జరగాలి

### -అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవు
### -రెవిన్యూ సదస్సుల్లో వచ్చిన వినతుల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక
### - రెవిన్యూ అధికారుల సమీక్ష లో కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

**విశాలాంధ్ర-విజయనగరం:** రీ సర్వే వినతులను పిజిఆర్ఎస్ లో అప్లోడ్ చేయడం, చేసిన వాటిని వెంటనే పరిష్కరించడం ఏక కాలంలో జరగాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. అప్లోడ్ చేసిన వాటిని పరిష్కరించకపోవడం వలన వాటి సంఖ్య ఆన్లైన్ లో ఎక్కువగా కనపడుతోందని తెలిపారు. శు క్రవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో రీ సర్వే , రెవిన్యూ సదస్సులలో అందిన వినతులపై తహసిల్దార్లు, సర్వేయర్ల తో మండలవరీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే వినతుల పరిష్కారానికి మండల వారీగా లక్ష్యాలను ఇచ్చి వేగంగా పరిష్కారం జరిగేలా చూడాలని జే.సి సేతు మాధవన్ కు సూచించారు. ప్రతిరోజు సమీక్షించాలని, లక్ష్యాలకు అనుగుణంగా పని చేయని వారి ఇంక్రిమెంట్లను నిలుపుదల చేయాలనీ సూచించారు. సర్వే శాఖ ఏ.డి కూడా ప్రతి రోజు పర్యవేక్షించాలని , సర్వేయర్ల పని తీరు పై ఆగ్రహం వ్యక్తం చేసారు. రెవిన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులలో డూప్లికేషన్ తీసేసి మిగిలిన వాటిని పిజిఆర్ఎస్ లో అప్లోడ్ చేయాలనీ తహసిల్దార్లకు ఆదేశించారు. శనివారం సాయంత్రం లోపల మొత్తం అప్లోడ్ చేయాలనీ తెలిపారు. ఇపటికే పరిష్కారం చేసిన వినతులను డిప్యూటీ కలెక్టర్లు ఆడిట్ చేయాలనీ, ఒక్క వినతికి తప్పుడు సమాధానం ఇచ్చినా సంబంధిత అధికారి పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేసారు. రెవిన్యూ వినతులను సబ్జెక్టు వారీగా వర్గీకరించి ఆర్.డి.ఓ లు పంపాలని, డి.ఆర్.ఓ వాటి పరిష్కారానికి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ఈ సమావేశం లో జే.సి సేతు మాధవన్, డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, ఆర్.డి.ఓ లు , డిప్యూటీ కలెక్టర్లు, తహసిల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## ఉర్రూతలూగించిన ఎడ్ల పరుగు పోటీలు

**విశాలాంధ్ర-వేపాడ:** మండలంలోని వీలుపర్తి గ్రామంలో వెలసిన నేరళ్ల పైడితల్లమ్మ తీర్థ మహోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు ప్రదర్శన సూపరలను ఉర్రూతలూగించాయి. ఈ పోటీలలో సుమారు15 ఎడ్ల బండ్లు పాల్గొనగా విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు. అలాగే తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ పెద్దలు ఘటాలతో డప్పు వాయిద్యాలతో అమ్మవారిని ఊరేగింపుగా నేరళ్ళ పైడిమాంబ గుడి వద్దకు చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించుకోవడంతోపాటు చీర సారేలు సమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాత్రి 9 గంటలకు కమిటీ, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశాఖ థ్రిల్లర్స్ వారిచే డాన్స్ బేబీ డాన్స్, శ్రీ రామాంజనేయ యుద్ధం అనే బుర్రకథ, మహిళా కోలాటం ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శానపతి లీల, అప్పారావు, ఉప సర్పంచ్ గోకాడ అచ్చం నాయుడు, పాల సంఘం అధ్యక్షుడు గోకాడ నాగభూషణం,జనసేన యువజన అధ్యక్షుడు గోకాడ సంతోష్, ఏడువాక మహేష్, కొప్పల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.